**బాలమిత్ర, జి. రామలక్ష్మి - హైదరాబాదు**

## ఆపద్బాంధవుడు

ఒకసారి బాబా తన భక్తులతో కలిసి సరదాగా మాట్లాడుతూ కాలక్షేపం చేస్తున్నారు. నవ్వుతున్నారు, హుషారుగా ఉన్నారు. ఉన్నట్లుండీ బాబా మౌనం వహించి అలాగే శూన్యంలోకి దీక్షగా చూస్తూండిపోయారు. అది గమనించిన భక్తులకు మాత్రం విషయం ఏమీ అర్థంకాలేదు.

బాబా మసీదుకి నాలుగు సందుల అవతల బాబాకి ప్రియమైన ఓ భక్తుడి కుటుంబం ఉంది. వాళ్ళు చాలా పేదవాళ్ళు. బాబానే నమ్ముకుని బ్రతుకుతున్నారు. చాలా శిథిలమైన ఇంట్లో ఉంటున్నారు వాళ్ళు. ఆ సమయంలో అంతా కలిసి భోజనాలకు కూర్చున్నారు.

అంతలో బాబా వచ్చి "మీరంతా ఒకసారి యిలా రండి. మీ అందరికీ ఓ తమాషా చూపిస్తాను. భోజనానిదేముంది. తర్వాతయినా చెయ్యొచ్చు" అన్నారు.

బాబా మాటకి అంతా బటయకు వచ్చారు. బాబా నవ్వుకుంటూ వాళ్ళందరినీ ఓ చెట్టు దగ్గరకు దూరంగా తీసుకువెళ్ళారు. అంతా అక్కడ నిల్చున్నారు.

"ఏంటి బాబా! తమాషా చూపిస్తానన్నారు?" అంటూ ఆ భక్తుడు అడిగాడు.

"తమాషాని తమాషాలాగానే చూడాలిగానీ, బాధపడకూడదు, బెంగపడకూడదు. ఈ లోకంలో ప్రాణంకన్నా విలువైనది మరొకటి లేదుసుమా! ఈ బాబా మీకున్నాడు. ఏ లోటూ రానీయడు. పైగా కాపాడతాడు కూడా!" అంటూ వారి యింటి వైపుకు చూపించారు.

అంతే! క్షణంలో ఆ పెద్ద పెంకుటిల్లు కాస్తా ఫెడేలుమంటూ శబ్దం చేస్తూ కూలిపోయింది.

వాళ్ళంతా ఘొల్లుమన్నారు తమకున్న ఆ ఒక్క ఆధారం పోయినందుకు. తర్వాత బాబా ఓదార్పుతో ఊరుకున్నారు. మర్నాడు మసీదులో బాబా ముచ్చటిస్తున్న సమయంలో కుటుంబ సమేతంగా వచ్చిన ఒక బాబా భక్తుడు అందరితో పాటు తానూ కూర్చుని బాబా చెప్పే విషయాలు అత్యంత శ్రద్ధగా వినసాగాడు. ఆ తర్వాత అంతకు ముందురోజు బాబా వచ్చి తమను కాపాడిన సంగతి చెప్పాడు పక్కనున్న వారితో.

వారు ఆశ్చర్యపోయి - “అరే! బాబా మీ ఇంటికి రావటం ఏమిటి? నిన్నటి రోజంతా మేము బాబా దగ్గరే ఉన్నాం. బాబా అసలు ఈ మసీదు వదిలి అసలు బయటకే పోలేదు” అన్నారు.

“అదేంకాదు. మీరే పొరపాటు పడుతున్నారు. బాబా తనే స్వయంగా వచ్చి మమ్మల్ని కాపాడకపోతే ఈ రోజు మేము మిగిలివుండే వాళ్ళమే కాదు. బాబా నిజంగా మామీద ఎంతో దయచూపారు” అని నొక్కి నొక్కి చెప్పాడు ఆ భక్తుడు.

“ఏం కాదు! బాబా అసలు బయటికే పోలేదు” అంటూ వాళ్ళు ఇలా వాదించుకుని బాబానే అడిగారు.

బాబా నవ్వి “ఇద్దరూ సరిగ్గానే, నిజంగానే చెప్పారు” అన్నారు. బాబా అంతరార్థం ఏమిటో ఎవరికీ అర్థంకాక నిర్ఘాంతపోయి చూడసాగారు.

అప్పుడు బాబా నవ్వుతూ “నా భక్తులను రక్షించవలసిన బాధ్యత నాదికాదా? నా మరో రూపమే వచ్చి మిమ్మల్ని కాపాడిరది. నవ్వుతూ నవ్వుతూ ఉన్న నేను క్షణకాలంలో మౌనంలోకి జారటానికి కారణం వాళ్ళ ఆపద తెలుసుకుని రక్షించవలసిన బాధ్యత గర్తుకు రావడంవల్లనే!” అన్నారు.

అది విని అందరూ అశ్చర్యపోయారు. బాబా సర్వాంతర్యామి అని. ఆపదల్లో ఉన్న వారిని ఆదుకునే ఆపద్బాంధవుడనీ వేనోళ్ళ పొగిడారు! కొనియాడారు! తాను ఉన్నచోటే ఉంటూ అదే రూపంలో భక్తులను రక్షిస్తున్న మహానుభావుడని ఎంతగానో ప్రశంసించారు. బాబా వారిని ప్రేమతో ఆశీర్వదించి, మరో నీడ కల్పించి ఆదుకున్నారు.